## నియోజకవర్గంలో కొత్త మండలాలు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్ టౌన్, జనవరి 8: హుజూరాబాద్ నియోజకవర్గంలో కొత్తగా నాలుగు మండలాలను ఏర్పాటు చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఉప్పల్, శనిగరం, వావిలాల, చల్లూరును వెంటనే మండలాలుగా ప్రకటించాలన్నారు. మండలాలుగా ప్రకటించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఈ నాలుగు గ్రామాలకు ఉన్నాయని తెలిపారు. కొత్త మండలాల ఏర్పాటుతో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు అన్ని విధాలా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే ఆయా నాలుగు గ్రామాలను మండలాలుగా ప్రకటించాలన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, జనవరి 8 : పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు. గంగాధరలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం సహకారం అందజేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, ఏపీఎం పవన్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

## సత్వరమే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

ముకరంపుర, జనవరి 8: రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సత్వరమే మంజూరు చేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ ఎం రమేశ్ బాబు పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ 31వరకు 1,204వ్యవసాయ సర్వీసులు మంజూరు కాగా, ఒక డిసెంబర్ నెలలోనే 160 సర్వీసులకు మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. 2023తో పోల్చితే సుమారు 30శాతం పెరిగిందని, వ్యవసాయ సర్వీసుల రిలీజ్‌కు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అగ్రికల్చర్ సర్వీసుల మంజూరు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో నిర్వహించడం ద్వారా దరఖాస్తు స్థితిని అగ్రికల్చర్ పోర్టల్(ఆన్‌లైన్)లో చూసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. మెటీరియల్‌ను కూడా ఈ స్టోర్స్ ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పొలంబాట ద్వారా రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

హుజూరాబాద్ టౌన్, జనవరి 8: ఎన్పీఎస్, సీపీఎస్ విధానాలను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఎస్‌టీవో శాఖ అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో టాప్రా డైరీ, క్యాలెండర్‌ను తహసీల్దార్ కనకయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాప్రా అధ్యక్షులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నూతన పీఆర్సీని జూలై 2023 నుంచి అమలు చేస్తూ, నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేఖర్, టాప్రా సభ్యులు బోంగోని వెంకటయ్య, సయ్యద్ మునీరుద్దీన్, రావికంటి రామకృష్ణయ్య, చీకట్ల సమ్మయ్య, మండల వీరస్వామి, సొల్లేటి మల్లారెడ్డి, గొట్టే జమదగ్ని, గంగిశెట్టి సాంబయ్య, తాటిపాముల కనకయ్య, టౌటమ్ శ్రీహరి, తాళ్లపల్లి రామకృష్ణ, మునిగంటి రవీందర్, ముక్క మొగిలయ్య, చింత సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'మానేరు'లో ముందస్తు సంక్రాంతి సంబురాలు



మానేరులో సంక్రాంతి సంబురాల్లో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

కొత్తపల్లి, జనవరి 8 : కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ వాతావరణం ఉట్టి పడేలా పాఠశాల ఆవరణను ముస్తాబు చేశారు. పలువురు విద్యార్థులు హరిదాసు, బసవన్నల వేషధారణతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేడుకలను మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని మతాలకు సంబంధించిన పండుగలను పాఠశాలలో అట్టహాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డితో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా నాటక సమాజాల కమిటీ ఆవిర్భావం

కమాన్‌చౌరస్తా, జనవరి 8 : రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటైంది. అధ్యక్షుడిగా రొడ్డ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా మాడిశెట్టి గోపాల్, కోశాధికారిగా తిప్పర్తి ప్రభాకర్ ఎంపికయ్యారు. ముఖ్య సలహాదారుగా పెద్దపల్లి రాజేంద్రప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా జి. కృపాదానం, ఉపాధ్యక్షులుగా కుడికాల ప్రభాకర్, వడ్నాల మాధవి, మంచాల రమేశ్, సింహాచలం యతీందర్, కోటగిరి దేవయ్య, సంయుక్త కార్యదర్శిగా కేఎస్ అనంతాచార్య, ప్రచార కార్యదర్శిగా గద్దె ఉదయ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా మున్నూరి రాజేశ్వరరావు, పబ్బా రాజమౌళి, అగస్టీన్, కొత్తకొండ సత్యనారాయణ, బి అజయ్ కుమార్, కూనమల్ల రమేశ్, ఏకే రెడ్డి, ఏ బాలకృష్ణమాచారిని ఎంపిక చేశారు. కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం ప్రమాణ స్వీకారం చేయించారు.

## పేదలను దోచుకుంటున్న హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలి

విద్యానగర్, జనవరి 8: పేదలను దోచుకుంటున్న ప్రైవేట్ హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్ యాదవ్ బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. పార్కింగ్, బిల్డింగ్ పర్మిషన్ లేకున్నా నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్‌పై చర్య తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా కార్యదర్శి దుబ్బాసి ప్రణీత్, నాయకులు తిరుపతి, సురేశ్, మండలాధ్యక్షుడు హరీశ్, పట్టణ ఇన్‌చార్జి మహేశ్, సిద్ధూ పాల్గొన్నారు.

## యశోద మెడికల్ సెంటర్‌లో రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

విద్యానగర్, జనవరి 8: కరీంనగర్‌లోని యశోద మెడికల్ సెంటర్ పది ఏళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సెంటర్ ఇన్‌చార్జి, మేనేజర్ సురభి రాజేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో గుండె, నరాల, ఎముకల, క్యాన్సర్, సాధారణ రోగాలకు ఉచితంగా వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారని తెలిపారు. అపాయింట్‌మెంట్ కోసం 9154246125 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ చేయాలి

కమాన్‌చౌరస్తా, జనవరి 8 : జిల్లా కేంద్రంలోని శర్మనగర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, నాయకుడు కసిరెడ్డి సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## చిగురుమామిడి ఆర్ఐపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిగురుమామిడి, జనవరి 8 : కరెంట్ సాంక్షన్ ఫాంపై సంతకం కోసం వెళ్తే చిగురుమామిడి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనతో దురుసుగా ప్రవర్తించాడని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన జక్కుల రాములు బుధవారం కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా సంతకం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, సంతకం పెట్టాలని అడిగితే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి లోపల వేయిస్తానంటూ బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# పరిశోధనలు అభివృద్ధికి తోడ్పడాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఎస్సారార్ కళాశాలలో జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి హాజరు



ఉత్తమ పరిశోధనా పత్రం సమర్పించిన అధ్యాపకుడికి పురస్కారం అందిస్తున్న కలెక్టర్

కమాన్‌చౌరస్తా, జనవరి 8 : కళాశాలలు పరిశోధనా కేంద్రాలుగా పరిణమించాలని, పరిశోధనా ఫలితాలు క్షేత్రస్థాయిలో సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆర్థిక సహకారంతో, ఆచార్య కల్వకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో సెమినార్‌కు హాజరు కావడం గొప్ప విషయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ, రెండు రోజుల సదస్సు యువ పరిశోధకులకు స్ఫూర్తినిస్తున్నదని, కళాశాలల్లో ముమ్ముందు అన్ని విషయాల్లో సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు 146 మంది ఔత్సాహిక పరిశోధకులు రిజిస్ట్రేషన్ చేసుకుని పత్రసమర్పణ చేశారని సదస్సు నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం మల్లారెడ్డి తెలిపారు. ఒమన్ నుంచి కూడా ఆన్‌లైన్‌లో పత్ర సమర్పణ చేశారన్నారు. ఈ సందర్భంగా నలుగురిని ఉత్తమ పరిశోధనా పత్ర సమర్పకులుగా అవార్డులకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవి కుమార్ జాస్తి, ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ ఎస్‌వీ ప్రసాద్ రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పి. నితిన్, టి. రాజయ్య, డాక్టర్ కే సురేందర్ రెడ్డి, అధ్యాపకుడు టీ శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జానపద కళలను ప్రోత్సహించాలి

కమాన్‌చౌరస్తా, జనవరి 8 : జానపద కళలను ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ 41వ వార్షికోత్సవం కళాభారతిలో బుధవారం జరుగగా, కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు జానపద కళా ప్రదర్శనలను వీక్షించేలా చూడాలని సూచించారు. మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ, జానపదం జీవించి ఉండాలంటే కొత్త తరం రావాలని ఆకాంక్షించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచేది కళాకారులేనన్నారు. అనంతరం జానపద వృత్తిలో రాణించిన వారికి కళాజ్యోతి జీవిత సాఫల్య పురస్కారం, యువ పురస్కారాలు, బాల పురస్కారాలు ప్రదానం చేశారు. కళాకారులు తమ ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ నాటక సమాఖ్య అధ్యక్షుడు సదానందం, తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు కృపాదానం, వంగ సురేందర్, సల్వాజి ప్రవీణ్, గోపాల్ రావు, కే రమణయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అవసరం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెప్టెన్, సతీశ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, జనవరి 8: పరిశ్రమలకు నైపుణ్యం గల మానవ వనరుల అవసరం ఎంతో ఉందని, అందుకు తగ్గట్లు అధ్యాపకులు ఇంజినీరింగ్ విద్యార్థులను ఉత్తమ శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దాలని కిట్స్ కార్యదర్శి సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా అడ్వాన్స్ ఇన్ మ్యాను ఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ 4.0 వాల్‌పోస్టర్‌ను కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతారావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎంవీ సతీశ్‌కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మల్లయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి చెట్టును ఢీకొన్న లారీ: క్లీనర్ మృతి

హుజూరాబాద్ రూరల్, జనవరి 8: లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో క్లీనర్ మృతి చెందగా, డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా నాచారం నుంచి గుజరాత్ రాష్ట్రానికి వెళ్తున్న లారీ బుధవారం తెల్లవారు జామున మందాడిపల్లి గ్రామం వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ క్యాబిన్‌లో డ్రైవర్, క్లీనర్ ఇరుక్కుపోగా, ఘటనా స్థలానికి టౌన్ సీఐ తన సిబ్బందితో చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఇద్దరినీ బయటికి తీశారు. అయితే క్లీనర్ మృతి చెందగా, తీవ్ర గాయాలతో ఉన్న డ్రైవర్‌ను హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. సుమారు గంట పాటు క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ నరకయాతన అనుభవించాడు. రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు కూడా నిలిచి పోయాయి.

## ప్రశాంతంగా ముగిసిన ఆఖరి కౌన్సిల్ మీటింగ్

హుజూరాబాద్ టౌన్, జనవరి 8: మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం ముగుస్తున్న క్రమంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆఖరుగా నిర్వహించిన కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. సమావేశంలో 53 అంశాలను ప్రతిపాదించగా.. 53 అంశాలకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అందులో పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీస్ వద్ద గల పైప్ లైన్ లీకేజీని అరికట్టి చాంబర్ ఏర్పాటు చేయడం, పారిశుధ్య వాహనాల రిపేర్ వంటి పనులు ఉన్నాయి. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లతో పాటు కార్యాలయ మేనేజర్ భూపాల్ రెడ్డి, ఇన్‌చార్జి మున్సిపల్ ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ అశ్వినీ గాంధీ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం కిషన్ రావు, సీనియర్ సహాయకుడు ఎండీ రషీద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన ఖోఖో క్రీడా శిక్షణ

తిమ్మాపూర్, జనవరి8: మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే పాఠశాలలో ఉమ్మడి జిల్లాలోని ఖోఖో మహిళా క్రీడాకారుల శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వారు వరంగల్ జిల్లా గీసుకొండలో ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులకు కోరుట్లలోని కేరళ స్కూల్ కరస్పాండెంట్ గంగాధర్ క్రీడా దుస్తులను అందజేశారు. రాష్ట్రస్థాయిలో జిల్లాను విజేతగా నిలుపాలని ఆర్సీవో అంజలి క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్ సరిత, పీడీలు శ్రీలేఖ, వసంత, ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌కు రూ. లక్ష విరాళం

కమాన్‌చౌరస్తా, జనవరి 8 : శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం 1981 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి, ఎన్ఆర్ఐ దేవళ్ల శ్రీధర్ రూ. 1,00,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల అభివృద్ధి కమిటీ బాధ్యులు బల్మూరి కరుణాకర్ రావు, కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి ఆయన్ను అభినందించారు.

## కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృత దేహం

హుజూరాబాద్ రూరల్, జనవరి 8: పెద్దపాపయ్యపల్లి గ్రామ సమీపంలోని కాకతీయ కాలువలో బుధవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. నీటిలో మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం రూంలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు.

## బ్యాంకు సేవలపై అవగాహన

చొప్పదండి, జనవరి 8: ఆర్నకొండ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు సేవలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ బెనర్జీ కృష్ణ విద్యార్థులతో బ్యాంకు ఖాతాలను తెరిపించారు. చెక్‌బుక్, డీడీలు, లావాదేవీలు ఎలా నిర్వహించాలో తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రాజమౌళి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానానికి స్పందన

తెలంగాణచౌక్, జనవరి 8: నగరంలోని ఆర్టీసీ ప్రాంగణంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించగా, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, డీఎంలు మల్లయ్య, విజయమాధురి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఊటూరి రాధాకృష్ణారెడ్డి, సభ్యులు కోల అన్నారెడ్డి, ఆర్టీసీ జోనల్ దవాఖాన డాక్టర్ శివ, ఏటీఎం సురేశ్, స్టేషన్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

చిగురుమామిడి, జనవరి 8: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ మండల కార్యాలయం ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో మాజీ మండల కార్యదర్శి ఎలగందుల రాజయ్య అధ్యక్షతన పార్టీ గ్రామ కార్యదర్శులు, ముఖ్యుల సమావేశం జరుగగా, ముఖ్య అతిథిగా చాడ హాజరై మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడి సైకిల్ యాత్ర

శంకరపట్నం, జనవరి 8: ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి, అయ్యప్పదీక్షాపరుడు కుడిది శ్రీనివాస్ చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరుకున్నది. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, అయ్యప్ప దీక్షాపరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు రాసమల్ల శ్రీనివాస్, చెరుకు వెంకటేశం, అలువాల గోపి, మేకల కుమార్, తిరుపతి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

## వసతి గృహంలో సీపీవో తనిఖీ

వీణవంక, జనవరి 8: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారి, సీపీవో కొమురయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని స్టోర్ రూమ్, సామగ్రి, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, వార్డెన్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన

సైదాపూర్, జనవరి 8: వెన్నంపల్లి గ్రామశివారులో ప్రభుత్వ భూమిలో మెగావాట్ సోలార్‌ప్లాంట్ ఏర్పాటు కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. డీఆర్‌డీవో శ్రీధర్‌తో పాటు తహసీల్దార్ మంజుల సర్వేనంబర్ 427లోని స్థలాన్ని చూశారు. ఇక్కడ ఏపీవో కుమారస్వామి ఉన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 8: నగరంలో లైన్ మెయింటనెన్స్, డీటీఆర్ బిగింపు పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య, కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

- ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు రాంనగర్, ఫిష్ మార్కెట్ ప్రాంతం, సంతోష్‌నగర్, సిద్ధార్థ స్కూల్, వాసర హాస్పిటల్, మానేరు స్కూల్ వెనుక ప్రాంతం, మంకమ్మతోట, సత్య లాడ్జి ఏరియా, రాజీవ్‌పార్కు, జయరాం హాస్పిటల్ ప్రాంతం, లేబర్ అడ్డా రోడ్డు, పద్మనగర్, బుల్ స్టేషన్, డెయిరీ ఫాం, డెయిరీ వెనుక ప్రాంతం, శ్రీహరినగర్, పీటీసీ ఏరియా, కుర్మవాడ, రాంనగర్, వాల్‌మార్ట్ ప్రాంతం
- ఉదయం 8.30 నుంచి 11గంటల వరకు ఖాజీపూర్, ఆసిఫ్‌నగర్, బావుపేట, చింతకుంట, ఎలగందుల
- ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు గంజ్, బోయవాడ, మార్కెట్ ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్స్, సిక్‌వాడీ, లక్ష్మీనగర్,రాఘవేంద్రనగర్, కమాన్ ఏరియా
- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు విద్యానగర్, విజయదుర్గ కాలనీ, హరిహర నగర్, వెంకటేశ్వర కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదు.

## ట్రాలీ ఆటో బోల్తా: 14 మంది కూలీలకు గాయాలు

హుజూరాబాద్ రూరల్, జనవరి 8: ట్రాలీఆటో బోల్తా పడి మహిళా కూలీలకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాలం ప్రకారం.. కందుగుల గ్రామానికి చెందిన 14 మంది మహిళా కూలీలు వరి నాటు వేయడానికి హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం బీంపెల్లి గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ధర్మరాజుపల్లి స్టేజీ వద్ద ఆటో అదుపుతప్పి డీవైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 13మందికి స్వల్పగాయాలయ్యాయి. 108వాహన సిబ్బంది వారిని హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

# అక్కాతమ్ముడికి దిక్కెవరు?

- ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో తల్లి.. నేడు తండ్రి మృతి
- అనాథలైన ఇద్దరు చిన్నారులు
- వృద్ధురాలు నానమ్మపైనే భారం
- ఆదుకోవాలని వేడుకోలు



సాయిచరణ్, వర్షిణి



చిన్నారుల తల్లిదండ్రులు రేణుక, వెంకటేశ్ (ఫైల్)

మానకొండూర్ రూరల్, జనవరి 8 : ఏడాదిన్నర క్రితం తల్లి.. ఇప్పుడు అన్నీ తానై పెంచిన తండ్రి మృతితో ఆ అక్కాతమ్ముడు అనాథలయ్యారు. తల్లిదండ్రుల మరణాన్ని తట్టుకోలేక బిక్కుబిక్కుమంటూ రోదిస్తున్నారు. ఈ ఇద్దరు పిల్లల భారం వృద్ధురాలు నానమ్మపై పడగా.. 'దేవుడా ఎందుకింత అన్యాయం చేశావు.. పిల్లలకు దిక్కెవరు' అంటూ విలపిస్తున్నది. ఈ పిల్లలను ఎలా సాదేది? అంటూ రోదిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలం ముంజంపల్లికి చెందిన బండారి వెంకటేశ్ (42)ది పేద కుటుంబం. ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న ఆయనకు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు వర్షిణి (12), సాయిచరణ్(11) ఉండగా.. ఏడాదిన్నర క్రితం భార్య అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి వెంకటేశ్ తన తల్లి మధురవ్వతో కలిసి ఉంటున్నాడు. ఏడో తరగతి చదువుతున్న కూతురు, ఆరో తరగతి చదువుతున్న కొడుక్కు అన్నీ తానే అయ్యాడు. మరోవైపు భార్య మృతి చెందడం.. ఏడాది కాలంగా ఆటో గిరాకీలు తగ్గిపోవడంతో తీవ్ర మనోవేదన చెందాడు. పిల్లలను సాదేదెలా అని రందీ పడ్డాడు. ఈ క్రమంలోనే అనారోగ్యం పాలయ్యాడు. ఐదు రోజుల క్రితం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చేరగా, మంగళవారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందాడు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించగా, కొడుకు సాయిచరణ్ నిప్పు పట్టడాన్ని చూసి గ్రామస్తులు సైతం కంటతడిపెట్టారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఈ ఇద్దరు పిల్లలను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## ఎస్‌హెచ్‌జీలతో సోలార్‌ప్లాంట్ల ఏర్పాటు: కలెక్టర్

కలెక్టరేట్, జనవరి 8: స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి జిల్లాలో ఇరవై ఎకరాల స్థలం గుర్తించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం ఉదయం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సోలార్‌ప్లాంట్ల స్థాపనకోసం జిల్లాలో చేపడుతున్న చర్యలపై ఆమె వివరించారు. చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి, చిగురుమామిడి, కొండాపూర్, సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామాల్లో సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించామని పేర్కొన్నారు. అలాగే, జిల్లాలోని మిగిలిన మండలాల్లో ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన భూమి గుర్తించనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీవో శ్రీధర్, డీఎఫ్‌వో బాలమణి, డీఆర్‌వో పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ఏర్పాట్లు

కలెక్టరేట్, జనవరి 8: కలెక్టరేట్‌లో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం ఆవరణలో ప్రధాన ద్వారం పక్కన ఖాళీ స్థలాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ కార్యనిర్వహణాధికారి గడ్డం సుధాకర్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులకు అవగాహన కలిగేలా ప్రతి మండల కేంద్రంలో 400 చదరపు ఫీట్లలో రూ.5లక్షలతో మోడల్ హౌస్ నిర్మిస్తున్నట్టు హౌసింగ్ డీఈఈ గంగాధర్ తెలిపారు.

## ఈవీఎం గోదాం పరిశీలన

కలెక్టరేట్, జనవరి 8: సమీకృత జిల్లా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఉన్న ఈవీఎంల గోదామును అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన గదులు, వీవీప్యాట్‌ల ఏర్పాట్లను పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. ఈవీఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల తీరుపై గోదాములో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, నాంపల్లి శ్రీనివాస్, కళ్యాడపు ఆగయ్య, బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా 'సర్వోదయ' వార్షికోత్సవం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకుడు విజయ్ కుమార్

కమాన్‌చౌరస్తా, జనవరి 8 : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్‌లోని సర్వోదయ సంగీత నిలయం మొదటి వార్షికోత్సవాన్ని విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు విజయ్ కుమార్‌తో పాటు విద్యార్థులు సంగీతం, కీబోర్డ్, సినిమా పాటలు పాడి అందరినీ అలరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, సర్వోదయ సంగీత నిలయం స్థాపించిన మొదటి సంవత్సరంలోని 30కి పైగా విద్యార్థులకు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా 150 మందికి సంగీతం నేర్పడం గొప్ప వరంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

## క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో బాలామణి

ముకరంపుర, జనవరి 8: రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని బుధవారం అటవీ శాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో బాలామణి ఆవిష్కరించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ సర్కిళ్లకు చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మహేందర్ రాజు, ముఖ్య సలహాదారులు కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, చక్రపాణి, సారయ్య, రాజగోపాల్ రెడ్డి, మధుసూదన్ రావు, సాంబమూర్తి, రామస్వామి, జగన్మోహన్, ప్రతాపరెడ్డి, ఖాదర్ మొహియుద్దీన్, రాజేశ్వర్, రాజేందర్ పాల్గొన్నారు.

## యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలి

తెలంగాణచౌక్, జనవరి 8: కరీంనగర్ జిల్లా యాదవ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ప్రెస్‌భవనంలో బుధవారం 9వ డివిజన్ కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, జిల్లా కార్యదర్శి సందబోయిన ప్రసాద్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జనాభా దామాషా ప్రకారం యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం యాదవ్, జంగా కొమురయ్యయాదవ్, కుమార్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణచౌక్, జనవరి 8: ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్గో రీజియన్ మేనేజర్ రామారావు సూచించారు. పెద్దపల్లిలోని కార్గో కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. వ్యాపారాభివృద్ధిలో భాగంగా గోదావరిఖని, మంథని ప్రాంతాల్లో పలువురు వ్యాపారులను కలుసుకొని కార్గో సేవల గురించి వివరించినట్లు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో డోర్ డెలివరీ సదుపాయం ఉందని, వస్తువులను తక్కువ చార్జీలతో భద్రంగా వినియోగదారులకు చేరవేస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా సెల్స్ లీడర్ రాజు ఉన్నారు.